సాక్షి విశాఖపట్నం

గురువారం । 18 । ఏప్రిల్ । 2024



వాటర్ పోలో చాంప్ నేవీ

73వ ఇంటర్ సర్వీసెస్ వాటర్ పోలో చాంపియన్‌షిప్ 2024 - 25 పోటీల్లో ఇండియన్ నేవీ జట్టు విజేతగా నిలిచింది. 8లో



పురావస్తు భాండాగారం తొట్లకొండ 11లో



మరిన్ని సమ్మర్ స్పెషల్ రైళ్లు

వేసవి రద్దీ దృష్ట్యా పలు మార్గాల్లో సమ్మర్ స్పెషల్ రైళ్లు (దువ్వాడ మీదుగా) నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. 11లో

రమణీయం.. సీతారామ కల్యాణం



సింహగిరిపై ఉన్న పురాతన రామాలయంలో తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న పండితులు

జిల్లాలో శ్రీరామనవమి ఘనంగా జరిగింది. అంబికాబాగ్ శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం, సింహగిరిపై ఉన్న పురాతన రామాలయం, మురళీనగర్‌లోని శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు జిల్లాలోని రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామి కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించారు. భక్తిపారవశ్యంలో మునిగితేలారు.

- అంబికాబాగ్ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఘనంగా శ్రీరామనవమి
- వాడవాడలా కల్యాణకాంతులు

డాబాగార్డెన్స్: అంబికాబాగ్ శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో బుధవారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 నుంచి 10 గంటల వరకు సీతాలక్ష్మణ సమేత రాముడి ఉత్సవమూర్తులకు అభిషేకాలు చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దేవస్థాన వేదపండితుల ఆధ్వర్యంలో సీతారామ కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామిని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్ సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్, తదితర ప్రముఖులు దర్శించుకుని కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అభిషేక సేవలో పలువురు ఉభయదాతలు, కల్యాణోత్సవంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం వేలాది మంది భక్తులకు విందు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష, ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారులు వి.రాంబాబు, కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



తాళికట్టు శుభవేళ..



జై శ్రీరామ్ అంటూ నినదిస్తున్న భక్తులు



నేడు పట్టాభిషేకం

కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 9 గంటలకు స్వామి పట్టాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ధ్వజావరోహణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



స్వామిని దర్శించుకుని ఆశీర్వాదం పొందుతున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్ సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు

- నేటి నుంచి కోసం సర్వే
- మే 7వ తేదీన ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం
- జేసీ మయూర్ అశోక్



మహారాణిపేట: వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకోవచ్చని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ చెప్పారు. అర్హులైన వారిని గుర్తించడం కోసం గురువారం నుంచి బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేస్తారని తెలిపారు. 85 ఏళ్ల దాటిన వృద్ధులు, 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులను గుర్తించి ఇంటి వద్దే ఓటింగ్‌కు అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సర్వేకు సంబంధించి వివరాలను బుధవారం మీడియా సమావేశంలో జేసీ వెల్లడించారు. ఫారం 12 (డి) ఇచ్చిన ఆధారంగా బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. మే 7న అదే ఇంటికి వెళ్లి రెండు బ్యాలెట్ పత్రాలు అందజేస్తామని చెప్పారు. ఒకటి పార్లమెంటు,రెండోది అసెంబ్లీ బ్యాలెట్ పత్రం ఉంటుందని.. వాళ్లు ఓటు వేసి తర్వాత బ్యాలెట్ బాక్సులో వేస్తారని తెలిపారు. ఈ ప్రక్రియను వీడియోలో చిత్రీకరించడం జరుగుతుందన్నారు. హోమ్ ఓటింగ్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు,పోలీసు సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొంటారని చెప్పారు. 7వ తేదీన ఓటు వేయలేని వారికి 9వ తేదీన అవకాశం కల్పిస్తామన్నారు. ఆరోజు వినియోగించుకోక పోతే ఓటు వేసే అవకాశం ఉండదని స్పష్టం చేశారు.

24 వేల మంది ఉంటారని అంచనా

జిల్లాలో మొత్తం 24 వేల మంది వృద్ధ ,40 శాతం పైబడిన దివ్యాంగులు ఉంటారని అంచనా వేసినట్టు చెప్పారు. వీరిలో 16 వేల మంది వృద్ధులు,8 వేల మంది దివ్యాంగులు ఉంటారని తెలిపారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లో భద్ర పరుస్తామని చెప్పారు.

అన్‌లోడింగ్‌లో విశాఖ పోర్టు రికార్డ్

విశాఖ సిటీ : అన్‌లోడింగ్‌లో విశాఖ పోర్టు అథారిటీ సరికొత్త రికార్డు నమోదు చేసింది. పోర్టులో ఈ క్యూ-9 బెర్త్‌కు వచ్చిన ఎం.వి.మిమ్ వాంజెలిస్ జూనియర్ నౌక నుంచి ఒక్క రోజులో 26,672 మెట్రిక్ టన్నుల లైమ్ స్టోన్‌ను అన్ లోడ్ చేసి చరిత్ర సృష్టించింది. గతేడాది ఆగస్టు 21న నమోదు చేసిన 25,948 మెట్రిక్ టన్నుల అన్‌లోడింగ్ రికార్డును అధిగమించింది.

అంతా సిద్ధం.. నేడే శ్రీకారం

నేడు ఎన్నికల నోటిఫికేషన్ జారీ

- 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- విస్తృత ఏర్పాట్లు చేసిన అధికారులు
- ఎన్నికల నిర్వహణకు 14,335 మంది సిబ్బంది



విశాఖ సిటీ: మరికొద్ది గంటల్లో సార్వత్రిక సమరానికి కీలక అడుగు పడనుంది. జిల్లా కలెక్టర్, జిల్లా ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. అనంతరం ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసింది. విశాఖపట్నం పార్లమెంట్ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇప్పటికే నామినేషన్ పత్రాలను సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయాలకు పంపించారు. ఎన్నికల నిర్వహణ కోసం 14,335 మందిని వినియోగించబోతున్నారు.

నామినేషన్లు స్వీకరించే ప్రాంతాలివే..

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత నుంచి నామినేషన్ల సందడి ప్రారంభం కానుంది. రాజకీయ పార్టీల అభ్యర్థులు ఇప్పటికే మంచి రోజులు చూసుకుని నామినేషన్లు వేసేందుకు సంసిద్ధంగా ఉన్నారు.

- పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి జిల్లా కలెక్టరేట్‌లో పార్లమెంట్ ఆర్వో కలెక్టర్ డా.మల్లికార్జున నామినేషన్లు స్వీకరించనున్నారు.
- విశాఖ తూర్పు నియోజకవర్గానికి జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది.
- దక్షిణ నియోజకవర్గానికి టర్నర్ చౌల్ట్రీ ఆవరణలోని మహారాణిపేట తహసీల్దార్ కార్యాలయం..
- విశాఖ ఉత్తర నియోజకవర్గానికి సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం..
- విశాఖ పశ్చిమ నియోజకవర్గానికి జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయం..
- భీమిలి నియోజకవర్గానికి భీమిలి ఆర్డీవో కార్యాలయం..
- పెందుర్తికి అక్కడి తహసీల్దార్ కార్యాలయం..
- గాజువాక నియోజకవర్గానికి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది.

ఐదుగురికి మాత్రమే అనుమతి

- నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే ఆర్వో కార్యాలయంలోకి అనుమతిస్తారు.
- మిగిలిన వారిని 100 మీటర్ల లోపే నిలిపివేస్తారు.
- కార్యాలయంలోకి మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది.
- పోటీ చేసే అభ్యర్థులు పార్లమెంట్‌కు రూ.25 వేలు, అసెంబ్లీకి రూ.10 వేలు ధరావత్తు చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఇందులో 50 శాతం చెల్లిస్తే సరిపోతుంది.
- నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సీసీ కెమెరాల ద్వారా రికార్డు చేయనున్నారు.

ఇదీ షెడ్యూల్

నామినేషన్ల స్వీకరణ:	ఈనెల 18వ తేదీ గురువారం నుంచి..
సమయం:	ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు
నామినేషన్లకు తుది గడువు:	ఈ నెల 25 మధ్యాహ్నం 3 గంటల వరకు
నామినేషన్ల పరిశీలన:	ఈ నెల 26వ తేదీ
ఉపసంహరణకు తుది గడువు:	ఈ నెల 29 మధ్యాహ్నం 3 గంటల వరకు
పోలింగ్ తేదీ	మే 13వ తేదీ
ఓట్ల లెక్కింపు	జూన్ 4వ తేదీ

అభ్యర్థుల ఖాతాల్లోకి ఖర్చులు

నామినేషన్ల పర్వం ప్రారంభమవుతుండడంతో ఎన్నికల ప్రచారాలు హోరెత్తనున్నాయి. నోటిఫికేషన్ విడుదలైన క్షణం నుంచి అభ్యర్థుల ప్రచారాలపై అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి పెట్టనుంది. ఇప్పటి వరకు రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రచారాలు చేస్తున్నప్పటికీ ఆ ఖర్చులు పార్టీల ఖాతాల్లోకి వెళ్లాయి. అయితే గురువారం నుంచి ప్రచారానికి సంబంధించిన ప్రతి ఖర్చు అభ్యర్థుల ఖాతాలో లెక్కిస్తారు. అభ్యర్థుల ఊరేగింపులను, నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమాలను సైతం వీడియో రికార్డింగ్ చేయనున్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి మరింత పక్కాగా అమలు చేయనున్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ)ని పరిశీలించి నివేదికలు అందించేందుకు 18 బృందాలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు 23 ఫ్లైయింగ్ స్క్వాడ్స్, 18 వీడియో సర్వైలెన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. నియోజకవర్గానికి ఒకరు చొప్పున అదనపు ఎన్నికల ఖర్చుల పరిశీలకులను నియమించారు.

ప్రచార ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

- స్పష్టం చేసిన జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున
- కలెక్టరేట్‌లో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు



మహారాణిపేట: ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాల్లో రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున స్పష్టం చేశారు. ఇందుకోసం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) సెల్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి మంజూరు చేయడంతో పాటు చెల్లింపు వార్తలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రకటన ప్రసార అనుమతి కోసం నిర్ణీత నమూనాలో మూడు రోజుల ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గుర్తింపు పొందని రాజకీయ పార్టీలు, ఇతర వ్యక్తులు ఏడు రోజుల ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు అందిన రెండు రోజుల్లోగా జిల్లా స్థాయి ఎంసీఎంసీ కమిటీ అనుమతి మంజూరు చేస్తుందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి అన్ని రకాల టీవీ చానళ్లు, కేబుల్ నెట్‌వర్క్స్, డిజిటల్ డిస్‌ప్లేలు, మొబైల్ నెట్‌వర్క్ ద్వారా ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు, సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్, గూగుల్ వెబ్‌సైట్, వికీపీడియా వస్తాయని వివరించారు. సినిమా థియేటర్లు, ప్రైవేట్ ఎఫ్ఎం రేడియోలు, పత్రికల్లో ప్రచురితమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలకు కూడా తప్పనిసరిగా ముందస్తు ధ్రువీకరణపొందాల్సి ఉంటుందన్నారు. అనుమతి పొందిన ఆర్డర్ నంబర్‌ను సంబంధిత ప్రకటనపై సూచించాలన్నారు. ఎంసీఎంసీ అనుమతి లేకుండా చేసే ప్రసారాలు, ప్రకటనలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద పరిగణించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలింగ్ రోజున..

వార్తా పత్రికల్లో పోలింగ్ రోజు, ముందు రోజు తప్పనిసరిగా ఎంసీఎంసీ నుంచి అనుమతి పొందిన తర్వాత మాత్రమే ప్రకటన ప్రచురించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రకటన ప్రచురించడానికి రెండు రోజుల ముందుగా సంబంధిత వ్యక్తి లేదా రాజకీయ పార్టీ ప్రతినిధి ఎంసీఎంసీ కమిటీని సంప్రదించాలన్నారు. ఆ రెండు రోజులూ అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయ ప్రకటనలను ప్రచురించడానికి వీలులేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

ప్రకటనల జారీలో చేయకూడనవి

ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ప్రకటనలు ప్రసారం చేసేటప్పుడు ఎన్నికల కమిషన్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు. కులాలను, మతాలను కించపరుస్తూ గానీ, అశ్లీలం, ఇతరుల పరువుకు నష్టం భంగం కలిగిస్తూ, హింసను ప్రేరేపించే విధంగా గానీ ప్రకటనలు ఉండరాదన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమాధికారానికి భంగం కలిగించేలా కానీ, న్యాయ వ్యవస్థను కించపరిచే విధంగా గానీ, కోర్టు ధిక్కరణ చేస్తూ గానీ ప్రకటనలు ఇవ్వరాదని స్పష్టం చేశారు. పేరుపెట్టి వ్యక్తిగత దూషణ చేయరాదని, వ్యక్తిగత జీవితాన్ని కించపరిచేలా ఉండరాదన్నారు. ఆలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారా తదితర మత చిహ్నాలను, పోస్టర్లను, సంబంధిత సంగీతాన్ని వినియోగించరాదన్నారు. డిఫెన్స్ పర్సనల్ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు వాడరాదన్నారు. ఇతర దేశాలను కించపరిచేలా ప్రకటనలు ఉండరాదని పేర్కొన్నారు. నిజ నిర్ధారణ లేకుండా ఇతర పార్టీలపై గానీ, ప్రతినిధులపై గానీ ఆరోపణలు చేస్తూ ప్రకటనలు ఇవ్వరాదని కలెక్టర్ స్పష్టం చేశారు.

పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక రైలు

బీచ్ రోడ్డు: దేశంలోని పలు పుణ్య క్షేత్రాల సందర్శన కోసం భారతీయ రైల్వే భారత్ గౌరవ్ పథకం కింద ప్రత్యేక రైలును వచ్చేనెల 18 నుంచి 29వ తేదీ వరకు నడపనున్నట్టు ఉలా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజ్ఞేష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యాత్ర వివరాలను తెలియజేశారు. ప్రయాగ్ రాజ్, వారణాసి, గయా, అయోధ్య, హరిద్వార్, ఢిల్లీ, మథుర, ఆగ్రా, తదితర ప్రాంతాలను సందర్శించేలా ఈ రైలు ప్రయాణం జరగనుందని పేర్కొన్నారు. ఈ రైలు తెలుగు రాష్ట్రాల్లో గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, విజయవాడ, వరంగల్ స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుందన్నారు. మరిన్ని వివరాల కోసం 74167 18800 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

జోన్-5 జెడ్సీ అధికార దుర్వినియోగం?

- సొంత అవసరాలకు జీవీఎంసీ వాహనాలు, సిబ్బంది వినియోగం
- ఎన్నికల్లో పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు
- తప్పు చేయని వారిపై చర్యలు తీసుకుంటున్నారని సిబ్బంది ఆవేదన

గోపాలపట్నం: ఆయన ఓ ఉన్నతాధికారి. నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ విధి నిర్వహణలో ఆదర్శంగా నిలవాలి. కానీ ఆయన మాత్రం అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. తనకు అనుకూలంగా ఉన్నా వారికి అండగా ఉంటూ.. లేని వారిపై వేధింపులకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఆయన వ్యవహార శైలిపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. నియంతలా వ్యవహరిస్తూ.. ఇబ్బందులు పెడుతున్నారని జోన్ పరిధిలోని ఉద్యోగులు, సిబ్బంది వాపోతున్నారు.

సొంత వ్యాపారాలకు జీవీఎంసీ సిబ్బంది

జీవీఎంసీ జోన్-5 కమిషనర్‌గా, ఏఆర్వోగా ఆర్.జి.వి. కృష్ణ విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు సొంతంగా పలు వ్యాపారాలు ఉన్నాయి. విధులు పక్కన పెట్టి వాటికే ఆయన పెద్దపీట వేస్తున్నారు. చినముషిడివాడలోని ఆయన ఇంట్లో అతని భార్య చీర ల వ్యాపారం నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో సోలార్ పవర్ సర్వీస్ వ్యాపారం ఉంది. ఇంటి వద్ద ఎలాంటి పనులున్నా.. జీవీఎంసీ వాహనాలతో పాటు సిబ్బందిని యథేచ్ఛగా వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పలాసలో నిర్వహిస్తున్న సోలార్ పవర్ వ్యాపారానికి కావాల్సిన సామగ్రిని వైజాగ్ నుంచి జీవీఎంసీ వాహనాలపై తరలిస్తున్నట్లు సమాచారం. అలాగే అక్కడ షాపులో, వ్యవసాయ పనులకు కూడా ఇక్కడి నుంచి జీవీఎంసీ సిబ్బందిని తీసుకువెళ్తున్నారని పలువురు జీవీఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.



పెందుర్తిలోని జోనల్ కమిషనర్ ఇంటి వద్ద జీవీఎంసీ అద్దె వాహనంలో సరకుల తరలింపు

ఎన్నికల నిబంధల పేరుతో వేధింపులు

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) పేరుతో తమను వేధింపులకు గుర్తి చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల జోన్-5లోని 52వ వార్డు శానిటరీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వెదుళ్ల శ్రీనివాసరావు ఓ పార్టీ ప్రచారంలో పాల్గొన్నాడని ఫిర్యాదు వచ్చింది. ఈ ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టకుండా సస్పెండ్ చేసినట్లు బాధితుడు తెలిపాడు. తర్వాత ఈ ఫిర్యాదుపై ఏఎంహెచ్‌వో ఎ.సునీల్‌కుమార్ విచారణ చేపట్టారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు క్షేత్ర స్థాయిలో ఆధారాలు లేవని ఆయన నివేదికలో పేర్కొనప్పటికీ.. జెడ్సీ పట్టించుకోవడం లేదని బాధితుడు వాపోతున్నాడు. ఇది పూర్తిగా ఉద్దేశపూర్వకంగా చేసిందేనని పలువురు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులో పేర్కొన్న సమయానికి శ్రీనివాసరావు ఎక్కడా.. ఏ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేదని స్థానికులు చెబుతున్నారు. ఆ ఫొటోలో ఉన్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆ సమయానికి జీవీఎంసీ కార్యాలయంలో ఉన్నారని చెబుతున్నారు. ఈ వ్యవహారంపై సీసీ ఫుటేజీలతో ఎన్నికల అధికారులు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు.



యథేచ్ఛగా వాడుకుంటున్న జీవీఎంసీ వాహనం, సిబ్బంది

వైజాగ్ @ 44.5

ఏప్రిల్ చరిత్రలో సరికొత్త రికార్డు

- ఇప్పటివరకు గత ఏప్రిల్ 19న 41.6 డిగ్రీలే అత్యధికం
- నిప్పుల కుంపటిని తలపిస్తున్న ఉష్ణతాపం
- దడ పుట్టిస్తున్న వడగాడ్పులతో అల్లాడుతున్న జనం
- మరింతగా పెరగనున్న ఉష్ణోగ్రతలు.. ముచ్చెమటలు

సాక్షి, విశాఖపట్నం : ఉష్ణతాపంలో విశాఖ రికార్డులు సృష్టిస్తోంది. మునుపెన్నడూ లేనంత వేడిని వెదజల్లుతోంది. రాష్ట్రంలో ఇతర ప్రాంతాల కంటే ఒకింత చల్లని వాతావరణం నెలకొంటుందని విశాఖకు పేరు. కానీ ఈ ఏడాది ఎండ వేడిమి అందుకు భిన్నంగా మారింది. ఏప్రిల్ నెలలోనే నిప్పుల కుంపటిని తలపిస్తోంది. కొద్ది రోజుల నుంచి వడగాడ్పులు, తీవ్ర వడగాడ్పుల ప్రభావం ఉమ్మడి విశాఖలో కొనసాగుతోంది. ప్రధానంగా అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో వీటి తీవ్రత అధికంగా ఉంటోంది. ఆ రెండు జిల్లాల కంటే విశాఖ జిల్లాలో ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. కానీ బుధవారం విశాఖ నగర పరిధిలోని ములగాడలో ఏకంగా 44.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. విశాఖ చరిత్రలో ఏప్రిల్ నెలలో 41.6 డిగ్రీలకు మించలేదు. ఇది గత ఏప్రిల్ 19న నమోదైంది. బుధవారం ఆ రికార్డును తిరగరాసింది. అంతేకాదు ఉమ్మడి విశాఖలోనూ బుధవారం నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత కూడా ఇదే. అధిక ఉష్ణోగ్రతలతో వడగాడ్పులు, తీవ్ర వడగాడ్పులు వీస్తున్నాయి. బుధవారం ఆ ప్రభావం మరింత ఎక్కువగా కనిపించింది. ఉదయం నుంచే భానుడు భగభగలాడుతూ సెగలు కక్కాడు. సాయంత్రం వరకు తీవ్రతను కొనసాగించాడు. దీంతో విశాఖపట్నం సహా అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పలుచోట్ల 40-44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భానుడి భగభగలకు జనం ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడే పరిస్థితి ఏర్పడింది. రోడ్లపై జనసంచారం బాగా తగ్గింది. రోడ్లు బోసిపోతూ కనిపించాయి. వడగాడ్పుల ధాటికి ప్రజలు ప్రయాణాలు తగ్గించుకున్నారు. తప్పనిసరి అయిన వారు మాత్రమే వెళ్లారు. రానున్న మూడు రోజులు కూడా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉష్ణ తీవ్రత కొనసాగుతుందని, వడగాడ్పుల ప్రభావం కొనసాగుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఉష్ణతాపంతో పాటు ఉక్కపోత కూడా ఉంటుందని తెలిపింది. అందువల్ల వడగాడ్పుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, ప్రయాణాలు చేయవద్దని సూచించింది.



గొడుగు నీడలో వెళ్తున్న విద్యార్థులు



ఎండకు తాళలేక చీర కప్పుకున్న మహిళ



బుధవారం నమోదైన ఉష్ణోగ్రతలు

జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత
విశాఖపట్నం	ములగాడ	44.5
అనకాపల్లి	రావికమతం	44.1
విశాఖపట్నం	పద్మనాభం	43.7
విశాఖపట్నం	గంభీరం	43.6
అనకాపల్లి	మాడుగుల	43.1
అనకాపల్లి	గొలుగొండ	43.0
అనకాపల్లి	చోడవరం	43.0
విశాఖపట్నం	నారాయణరాజుపేట	42.5

ఎన్నికల నిర్వహణ సిబ్బంది కోసం ప్రత్యేక ఓటింగ్

- ఏయూలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు
- మే 5వ తేదీన ఓటింగ్

మహారాణిపేట: ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఈ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్లు ఉపయోగించుకునే వారు. కాని ఈసారి పద్ధతిలో మార్పు చేశారు. మొత్తం 15 వేల మంది సిబ్బంది, అధికారులు ఎన్నికల నిర్వహణలో, 3 వేల మంది పోలీసు సిబ్బంది బందోబస్తు విధుల్లో ఉంటారని అంచనా వేశారు. వీరితో పాటు ఎన్నికల నిర్వహణలో పాల్గొనే ఇతర సిబ్బంది కూడా ఇదే తరహాలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వీరంతా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ మీడియా సమావేశంలో తెలిపారు. దీని కోసం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సెంటర్‌కు వెళ్లి ఓటు వేయాలన్నారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన తర్వాత ఈనెల 29వ తేదీ నాటికి బ్యాలెట్ పత్రాలు సిద్ధం అవుతాయన్నారు. ఉద్యోగులు మే 5వ తేదీన తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఆ రోజు వీలు కాకపోతే మే 6వ తేదీన ఓటు వేయొచ్చని తెలిపారు.

సర్వీస్ ఓటర్ల కోసం పోస్టల్ బ్యాలెట్..

సర్వీస్ ఓటర్ల కోసం పోస్టల్ బ్యాలెట్ ప్రవేశపెడుతున్నారు. దాదాపు 3 వేల మందికి పైగా సర్వీసు ఓటర్లు ఉంటారని అంచనా వేశారు. వీరికి ఆన్‌లైన్ ద్వారా బ్యాలెట్ పత్రాలు పంపుతారు. వీరి కోసం రెండు బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేస్తున్నారు. ఒకటి అసెంబ్లీ, ఇంకొకటి పార్లమెంటు బ్యాలెట్ పత్రం. జిల్లా సైనిక సంక్షేమ శాఖ ద్వారా ఈనెల 29వ తేదీ నాటికి అవి ఆన్‌లైన్‌లో లభ్యం కానున్నాయి. సర్వీస్ ఓటర్లు వాటిని డౌన్‌లోడు చేసుకోవలసి ఉంటుంది. ఆ పత్రాలను నింపి ఒక ప్రత్యేక కవరులో పోస్టు బాక్సుల్లో వేయాలి. అలా అవి ఉచితంగా రిటర్నింగ్ అధికారికి చేరుతాయి.

మాడుగుల టీడీపీలో పైసా పెత్తనం



చంద్రబాబు పంపితేనే అనకాపల్లి వచ్చా.. ఉత్తరాంధ్ర టీడీపీకి ఒకప్పుడు ఎర్రన్నాయుడు పెద్దదిక్కుగా ఉండేవారు. ఇప్పుడు ఆ స్థానాన్ని నేను భర్తీ చేస్తా.. అంటూ ఈమధ్య సీఎం రమేష్ చేసిన వ్యాఖ్యలకు అప్పుడే టీడీపీ శ్రేణులు మండిపడ్డాయి. ఇప్పుడు ఏకంగా మాడుగుల తెలుగుదేశం అభ్యర్థి పైలా ప్రసాదరావునే మార్చేలా పావులు కదపడంతో మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తమ మీద బీజేపీ నేత పెత్తనమేమిటని ప్రశ్నిస్తున్నాయి. రమేష్ రాజకీయానికి మాడుగుల టీడీపీలోని రెండు వర్గాలు అమ్ముడుపోవడం క్యాడర్‌ను కుంగదీస్తోంది.

సాక్షి, అనకాపల్లి:

చంద్రబాబు చీదరించుకొని టికెట్ ఇవ్వను పొమ్మన్న నేతలందరూ ఒక్కటవుతున్నారు. పోయిన పరువును కాస్త కూడదీసుకునేందుకు తంటాలు పడుతున్నారు. వీరిని సీఎం రమేష్ చేరదీస్తున్నారు. వారిని కొనేసి తనకు అనుకూలమైన వ్యక్తిని తెచ్చి పెట్టేందుకు ఆయన చేసిన యత్నాలు కొలిక్కి వచ్చాయని తెలుస్తోంది. మాడుగుల అభ్యర్థిగా పైలా ప్రసాదరావు బదులు మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఈ పరిణామాలు మాడుగులలో అంతంత మాత్రంగా ఉన్న టీడీపీ ఆశలను మరింత ఆవిరి చేస్తాయేమోనన్న భయాందోళనలను పార్టీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. పార్టీని నమ్ముకున్న మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడికి టికెట్ దక్కలేదు. ఆయనను కాదని నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించిన పీవీజీ కుమార్‌కు కూడా చంద్రబాబు ఆశీస్సులు లభించలేదు.

తమను కాదని పైలా ప్రసాదరావుకు టికెట్ కేటాయించడంపై వీరిద్దరూ గుర్రుగా ఉన్నారు. ఇప్పుడు వీరిద్దరినీ తాయిలాలతో ప్రసన్నం చేసుకొని టీడీపీ అభ్యర్థి పైలాకు ఎసరు పెట్టడానికి సీఎం రమేష్ నడుం బిగించారు. తనకు సన్నిహితుడైన మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిని తెచ్చుకునేందుకు లైన్ క్లియర్ చేసుకున్నారు. ఇందుకు గవిరెడ్డి, పీవీజీలకు రూ.4 కోట్లు, రూ.2 కోట్లు ముట్టజెప్పినట్టు సమాచారం. రమేష్ టీడీపీ నేతలపై పైసలతో పెత్తనం చెలాయించడం.. తమ నేతలు అమ్ముడుపోయారన్న విషయం ప్రజల్లో తమ పార్టీని చులకన చేస్తుందన్న భయం వారిని వెంటాడుతోంది.

- సీఎం రమేష్ జేబులో తెలుగుదేశం
- పైలా అవుట్.. బండారు ఇన్?
- గవిరెడ్డి, పీవీజీ కుమార్‌లకు రూ.కోట్లలో ఎర!
- రమేష్ వైఖరిపై కుతకుతలాడుతున్న టీడీపీ క్యాడర్
- ఎలా గెలుస్తారో చూస్తామంటున్న పైలా ప్రసాద్ వర్గీయులు

పైలా రాజీనామా యోచన?

అసలు స్థానికేతరుడైన సీఎం రమేష్‌కు అనకాపల్లి ఎంపీ టికెట్ ఇవ్వడమే తప్పు.. దీనికి తోడు చక్కగా ఉన్న నియోజకవర్గాల్లో టీడీపీలో అగ్గి రాల్చుతున్నాడంటూ టీడీపీ కార్యకర్తలు మండిపడుతున్నారు. స్థానికులను కాదని పొరుగు నియోజకవర్గాల నుంచి ఇక్కడకు తీసుకొస్తే సహించేది లేదని ప్రసాదరావు వర్గీయులు చెబుతున్నారు. అభ్యర్థి మార్పు జరిగితే తర్వాత జరిగే పరిణామాలు ఊహించుకోవడానికే భయంకరంగా ఉంటాయని హెచ్చరిస్తున్నారు. మాడుగుల ఎమ్మెల్యే టికెట్ బండారుకు ప్రకటిస్తే.. పైలా ప్రసాదరావుతోపాటు ఆయన వర్గీయులు టీడీపీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

అధినేత వైఖరితో డీలా పడ్డ టీడీపీ క్యాడర్

ఒకప్పుడు చంద్రబాబు వ్యూహాలు పదునుగా ఉండేవి. ఎత్తు వేస్తే ప్రత్యర్థులు చిత్తు కావలసిందే అన్న రీతిలో పావులు కదిపేవారు. కానీ ఈసారి ఎన్నికల్లో ఆయన నిర్ణయాలు పార్టీ వర్గాలకు మింగుడుపడడం లేదు. అనకాపల్లి అసెంబ్లీ సీటు జనసేనకు కేటాయించారు. చాలాకాలంగా ప్రజలు మరచిపోయిన కొణతాల రామకృష్ణ ఆ టికెట్ దక్కించుకున్నారు. అనకాపల్లి పార్లమెంటు సీటు బీజేపీకి వదులుకున్నారు. అక్కడికి రాయలసీమ నుంచి సీఎం రమేష్‌ను తీసుకొచ్చారు. స్థానికేతరుడు మాకెందుకని ఒకపక్క టీడీపీ కార్యకర్తలు తల పట్టుకుంటుంటే.. చంద్రబాబే పంపారని రమేష్ చెప్పుకుంటున్నారు. ఇప్పుడు దాదాపు నెల రోజుల క్రితమే చంద్రబాబు ప్రకటించిన పైలా ప్రసాదరావు.. సీఎం రమేష్ తలచుకున్నంతనే మారిపోతున్నారు. అధినేత స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారన్న భయం పార్టీ క్యాడర్‌ను వెంటాడుతోంది.

జగన్ పాలనలో చరిత్రాత్మక పథకాలు



మాట్లాడుతున్న విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, చిత్రంలో ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

- వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి
- రజకులతో ఆత్మీయ సమావేశం

సీతమ్మధార: దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ ఉత్తర కార్యాలయంలో బుధవారం రజకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యేగా కె.కె.రాజును, విశాఖ ఎంపీగా తనను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించుకోవాలని కోరారు. పార్టీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సరికొత్త సంక్షేమ పథకాలను అమలు చేసి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. వలంటీర్ల ద్వారా అర్హులందరికీ ఇళ్ల వద్దకే పథకాలు చేరేలా చర్యలు చేపట్టి ప్రజాదారణ పొందుతున్నారన్నారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని, మరోమారు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు కోడూరి సత్యనారాయణ, పొన్నాడ మోహనరావు, రామ్మోహన్, జైనాథ్, సిహెచ్.అప్పారావు, వెంకటరావు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కె.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏలో ప్రవేశానికి దరఖాస్తులు

బీచ్ రోడ్డు: నేషనల్ స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లాజిస్టిక్స్ కౌన్సిల్ సహకారంతో ఆంధ్రా యూనివర్సిటీలో ఎంబీఏ(లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. గురువారం నుంచి జూన్ 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. 60 సీట్ల భర్తీకి సంబంధించి డిఫెన్స్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు రూ.40 వేలు ఫీజు, ఇతరులకు రూ.60 వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫీజు 1200 కాగా ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు రూ.1000గా నిర్ణయించారు. ఆసక్తి ఉన్న వారు మరిన్ని వివరాల కోసం ఏయూ వెబ్‌సైట్ www.audoa.in సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

అదానీ గంగవరం పోర్టు వద్ద ఉద్రిక్తత

భారీగా మోహరించిన పోలీసులు



అదానీ గంగవరం పోర్టు గేటు మోహరించిన పోలీసులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు వద్ద బుధవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. కార్మికుల ఆందోళనను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా వారంతా ఎదురు తిరిగారు. గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులు 8 రోజులుగా పోర్టు గేటు వద్ద ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. కార్మికుల డిమాండ్లకు యాజమాన్యం ససేమిరా అనడంతో కార్మికులు వెనక్కి తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం పోలీసులను మోహరించారు. ఆందోళనకు దిగిన కార్మికులను చెదరగొట్టేందుకు ప్రయత్నించగా, వారు తిప్పికొట్టారు. ఈ సందర్భంగా నిర్వాసిత కార్మికుల కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ పోర్టులో పని చేస్తున్న 4వేల మంది కార్మికులు ఆందోళన చేస్తుంటే యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న కార్మికులపై పోలీసులను ఉసిగొల్పడం సరికాదన్నారు.

అర్ధరాత్రి హైడ్రామా: గంగవరం పోర్టు వద్ద హైడ్రామా చోటు చేసుకుంది. ఓ పక్క కార్మికులు తమ కుటుంబాలతో నిరసన తెలుపుతుంటే మరోపక్క యాజమాన్యం మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో కొంతమందిని తీసుకువచ్చి పోర్టులో పనులు చేయాలని ప్రయత్నించారు. దీంతో కార్మికులంతా ఒక్కసారిగా వారిని అడ్డుకున్నారు. యాజమాన్య ప్రతినిధులు, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ప్రైవేటు కార్మికులను లోపలికి పంపిస్తే పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటామని కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సీసాలతో తీసుకువచ్చిన పెట్రోల్ చూపించి హెచ్చరించారు. దీంతో చేసేది లేక ప్రైవేటు కార్మికులను అక్కడి నుంచి పంపించేశారు.

యాజమాన్యంతో సీపీ చర్చలు

సీపీ రవిశంకర్ బుధవారం సాయంత్రం పోర్టు యాజమాన్య ప్రతినిధులతో చర్చించారు. ముందుగా కార్మికులతో మాట్లాడిన ఆయన, అనంతరం యాజమాన్యంతో చర్చలు జరిపారు.

ఎంపీ, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నా..

- నేడు నామినేషన్
- కె.ఎ.పాల్ వెల్లడి



ప్రజాశాంతి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న కె.ఎ.పాల్

తాటిచెట్లపాలెం: సార్వత్రిక ఎన్నికల్లో విశాఖపట్నం పార్లమెంట్ సభ్యుడిగా, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థిగా గురువారం నామినేషన్ వేస్తున్నట్లు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎ.పాల్ వెల్లడించారు. రైల్వే న్యూకాలనీలోని ప్రజాశాంతి కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని.. ఏపీ, తెలంగాణలో మోదీకి వ్యతిరేకంగా పోరాడే దమ్ము, ధైర్యం తనకు మాత్రమే ఉందన్నారు. మణిపూర్‌లో ఎందరో ప్రాణాలు కోల్పోయారని.. ఇలాగే ఊరుకుంటే ప్రతీ రాష్ట్రం మణిపూర్‌లా మారుతుందని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోర్టు నుంచి ఉత్తర్వులు తీసుకురాగలిగానని చెప్పారు. సొంత నిధులతో అనే కార్యక్రమాలు చేపట్టానన్నా రు. గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీగా, మధ్యాహ్నం ఒంటి గంటకు ఎమ్మెల్యేగా నామినేషన్ వేస్తున్నట్లు వివరించారు. అనంతరం ప్రచార గీతాన్ని ఆవిష్కరించారు. పార్టీ నాయకులు రెడ్డి యేసుపాదం, జిలుకర రవికుమార్ పాల్గొన్నారు.

శరీర సౌష్టవ పోటీల్లో సత్తా

విశాఖ స్పోర్ట్స్: వాల్తేర్ రైల్వే డివిజన్‌లో అంతర్ విభాగాల శరీర సౌష్టవ పోటీల్లో ఓవరాల్‌గా ఎస్.సునీల్‌కుమార్ సత్తా చాటాడు. మెన్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో 55 కేజీల వెయిట్ నుంచి 90 కేజీల వెయిట్ వరకు పలు క్యాటగిరీల్లో పోటీలు నిర్వహించారు. కారేజ్, వేగన్ జట్లు విజేతగా నిలువగా.. సివిల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ జట్లు రన్నరప్స్‌గా నిలిచాయి. 55–60 కేజీల వెయిట్‌లో పి.అరవింద్, 60–65 కేజీల్లో వై.నరసింహమూర్తి, 65–70లో ఎస్.సునీల్‌కుమార్ విజేతలయ్యారు. 75–80లో పి.సంతోష్‌కుమార్, 80–85లో జేడీ ప్రసాద్, 85–90 కేజీల వెయిట్‌లో జె.రాజ్‌కుమార్ విజేతలుగా నిలిచారు.

మూడు రెస్టారెంట్ అండ్ బార్లపై కేసులు

- అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కూడా
- కొరడా ఝుళిపించిన ఫ్లయింగ్ స్క్వాడ్

మహారాణిపేట: ఎన్నికల్లో మద్యం ప్రవాహాన్ని నిలువరించడానికి పది మంది సభ్యులతో నియమించిన జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ బుధవారం పలు రెస్టారెంట్ అండ్ బార్లపై ఆకస్మిక దాడులు నిర్వహించింది. నిబంధనలు అతిక్రమించిన 3 రెస్టారెంట్ అండ్ బార్లపై కేసులు నమోదు చేసినట్టు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున తెలిపారు. అలాగే మహారాణిపేట, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ల పరిధిలో అనుమతి లేకుండా మద్యం కలిగిన ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్టు వివరించారు. ఒక ప్రభుత్వ మద్యం దుకాణంలో రికార్డులు సరిగా నిర్వహించపోవడం,కృత్రిమ డిమాండ్ సృష్టించి ఎక్కువ రేట్లకు మద్యం విక్రయిస్తున్న కారణాలతో డిపో మేనేజర్ చర్యలు తీసుకోవాలని టీమ్ సభ్యులు సిఫార్సు చేశారు. ఎక్సైజ్ పాలసీ నిబంధనల ప్రకారం బార్, రెస్టారెంట్ యజమానులు, ప్రభుత్వ మద్యం దుకాణాలు సమయ పాలన పాటించాలని కలెక్టర్ కోరారు. లేని పక్షంలో చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

ఇండియన్ నేవీ టీమ్‌కు వాటర్ పోలో చాంపియన్‌షిప్

సింధియా : 73వ ఇంటర్ సర్వీసెస్ వాటర్ పోలో చాంపియన్‌షిప్ 2024 - 25 పోటీల్లో ఇండియన్ నేవీ జట్టు విజేతగా నిలిచింది. తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో త్వరలో 77వ సీనియర్ నేషనల్స్ ఆక్వాటిక్స్ చాంపియన్‌షిప్ - 2024 నిర్వహించనున్నారు. ఇందుకోసం సర్వీసెస్ టీమ్‌ను ఎంపిక చేయడంతోపాటు సిబ్బంది మధ్య క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్మిరల్ ఎంకే వెంకట్రామన్ ముఖ్య అతిథిగా హాజరై ఇండియన్ నేవీ టీమ్‌కు ట్రోఫీ అందజేయడంతోపాటు విజేతలకు పతకాలు ప్రదానం చేశారు. భారత నౌకాదళం , భారత వైమానిక దళానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 30 మందికిపైగా క్రీడాకారులు చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నారు.

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	రూ.130
స్కిన్	రూ.230
స్కిన్‌లెస్	రూ.240

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.74,130
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.67,950
వెండి(కిలో):	రూ.90,000